మనం

హైదరాబాద్ రంగారెడ్డి | మేడ్చల్

బుధవారం | 4 | నవంబర్ | 2026 పేజీలు: 6

మాత అమృతానందమయి పర్యటనకు
పకడ్బందీ ఏర్పాట్లు



భక్తులు, వీఐపీల రాక నేపథ్యంలో ప్రత్యేక చర్యలు..


ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి: అధికారులకు ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆదేశం

2

అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు



అదనపు కలెక్టర్ (సివిల్ సప్లయస్) డి.విజయంధర్ రెడ్డి



3

మేడ్చల్, నవంబర్ 3: (మనం జిల్లా ప్రతినిధి): నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని, అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులకు కలెక్టర్ (సివిల్ సప్లై) డి.విజయంధర్ రెడ్డి హెచ్చరించారు.



పగిలిన డైనేజీ పైప్‌లైన్‌తో
రోడ్డుపైకి మురుగునీరు

3

నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం..



జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై
అఖిలపక్ష ఐక్య పోరాటం



శాశ్వత పరిష్కారం కోసం 108 రోజుల కార్యాచరణ

ప్రణాళిక ప్రతిపాదన

పార్టీలకతీతంగా ప్రజా సమస్య పరిష్కారమే లక్ష్యం : తోటకూర వజ్రేష్ యాదవ్

2

హైదరాబాద్, నవంబర్ 3 (మనం న్యూస్): జవహర్నగర్ డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసన, పర్యావరణ కాలుష్యం, ప్రజారోగ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధించడమే లక్ష్యంగా మంగళవారం నాగారంలోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు.

బీజేపీ రాష్ట్ర సహ ఇంచార్జ్‌లతో
ఎంపీ ఈటల కీలక భేటీ

రాష్ట్ర రాజకీయాలు, పార్టీ బలోపేతం, కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై విస్తృత చర్చ



2





మాత అమృతానందమయి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

భక్తులు, వీఐపీల రాక నేపథ్యంలో ప్రత్యేక చర్యలు..

ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి: అధికారులకు ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆదేశం

సికింద్రాబాద్, నవంబర్ 3 (మనం న్యూస్) ప్రముఖ ఆధ్యాత్మిక గురువు మాత అమృతానందమయి నగర పర్యటనను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సూచించారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు మహేంద్ర హిల్స్‌లోని అమృతానందమయి మఠంలో ఆమె బస చేయనున్న నేపథ్యంలో మంగళవారం మఠం నిర్వాహకులు, కంటోన్మెంట్ అధికారులు, పోలీస్ శాఖతో పాటు వివిధ విభాగాల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ పర్యటనకు సుమారు వెయ్యి మంది భక్తులు, వాలంటీర్లు హాజరుకానుండగా, 20 బస్సులు, 20 కార్లు, ఏడు ట్రక్కుల్లో అనుచరులు రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో వాహనాల పార్కింగ్ కు తగిన స్థలాన్ని కేటాయించడం, మఠం పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు తదితర సౌకర్యాల కల్పనపై ఎమ్మెల్యే అధికారులకు దిశానిర్దేశం చేశారు. భక్తుల రాకపోకలతో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. మాత అమృతానందమయిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రముఖులు, వీఐపీలు వచ్చే అవకాశం ఉన్నందున భద్రతా ఏర్పాట్ల విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహేంద్ర హిల్స్ కేంద్రంగా మఠం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

కూచిపూడి నృత్యంలో వైష్ణవికి 12 ప్రపంచ రికార్డులు

హైదరాబాద్, నవంబర్ 03 (మనం న్యూస్) : కేవలం 12 ఏళ్ల వయసులో ఏకధాటిగా 12 గంటల పాటు కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి 12 ప్రపంచ రికార్డులు సాధించి చిన్నారి రుంకు వైష్ణవి అందరి ప్రశంసలు అందుకుంది. స్పందన నృత్యకేళి స్కూల్ ఆఫ్ డాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గణ నృత్యం' కార్యక్రమంలో 122 భంగిమలు, 522 పాటలకు అనుగుణంగా నృత్యం చేసి ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా భారత్ వరల్ రికార్డ్స్ అధ్యక్షుడు, ప్రపంచ రికార్డుల నేషనల్ కోఆర్డినేటర్ లయన్ కె.వి.రమణారావు, ప్రపంచ



రికార్డుల జ్యూరీ సభ్యురాలు, మిస్ గార్జియస్ ఇండియా-2026 విజేత అలిసియా జోసెఫ్, రాష్ట్ర ప్రతినిధి దండు ఉషశ్రీ వైష్ణవికి 12 రికార్డుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిన నృత్య గురువు డా.ఎన్.రవికుమార్ను అతిథులు అభినందించారు. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, ఉపాధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు బొంగూరి మహేందర్ రెడ్డి, నెమూరి శంకర్ గౌడ్, ప్రేమ్ కుమార్, అల్లాడి తనీష్, ఎరుకొండ రాజు, కుప్ప శ్రీకాంత్ గౌడ్, జక్క కృష్ణ, నందగిరి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర సహ ఇంచార్జ్‌లతో
ఎంపీ ఈటల కీలక భేటీ





రాష్ట్ర రాజకీయాలు, పార్టీ బలోపేతం, కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై విస్తృత చర్చ

మేడ్చల్, నవంబర్ 3 : (మనం జిల్లా ప్రతినిధి): మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సహ ఇన్చార్జి (సహ ప్రభారీలు), రాజ్యసభ సభ్యురాలు రేఖా శర్మ, కర్ణాటకలోని బెలగావి దక్షిణ అసెంబ్లీ ఎమ్మెల్యే అభయ్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈటల రాజేందర్ నివాసానికి విచ్చేసిన వారికి ఆయన సాదర స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలోపేతం తదితర కీలక అంశాలపై నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే అంశంపై ఈ భేటీలో ప్రత్యేకంగా సమాలోచనలు జరిపారు. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో చేపట్టబోయే భవిష్యత్ పోరాట కార్యాచరణపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా బూత్ స్థాయి నుంచి బీజేపీని మరింత పటిష్టం చేసేందుకు, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ చేరవేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు చర్చించారు. పార్టీ కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేలా సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రం రెడ్డి బిజెపి జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ రాష్ట్ర నాయకులు నంద రెడ్డి పలువురు స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై అఖిలపక్ష ఐక్య పోరాటం

శాశ్వత పరిష్కారం కోసం 108 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రతిపాదన

పార్టీలకతీతంగా ప్రజా సమస్య పరిష్కారమే లక్ష్యం : తోటకూర వజ్రేష్ యాదవ్



హైదరాబాద్, నవంబర్ 3 (మనం న్యూస్): జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసన, పర్యావరణ కాలుష్యం, ప్రజారోగ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధించడమే లక్ష్యంగా మంగళవారం నాగారంలోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్య ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, వేలాది మంది ప్రజల జీవనానికి, ఆరోగ్యానికి సంబంధించిన కీలకమైన ప్రజా సమస్య అని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ సమస్య పరిష్కారం కోసం రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ఐక్య పోరాటాన్ని కొనసాగించాలని అన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కోసం 108 రోజుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, దశలవారీగా ఉద్యమ కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో ప్రతిపాదించారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్థానిక ప్రజలను సమన్వయం చేసుకుంటూ భవిష్యత్ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలని నాయకులు చర్చించారు.

ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధించే దిశగా అఖిలపక్షం ఐక్యంగా ఉద్యమించాలని సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది.


ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సీపీఐ మాస్ లైన్ నాయకులు గడ్డం సదానందం, సీపీఎం నాయకులు పి. సత్యం, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు మారం లక్ష్మారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, దమ్మాయిగూడ జేఏసీ చైర్మన్ శంకర్ నాయక్, జవహర్‌నగర్ జేఏసీ కన్వీనర్ షేక్ షావలీ, జేఏసీ నాయకులు సామిరెడ్డి, సంజీవరెడ్డి, స్వర్ణ, కేపీ చారి, తెలంగాణ రక్షణ సమితి పార్టీ అధ్యక్షురాలు మేక లలిత యాదవ్, దమ్మాయిగూడ డివిజన్ అధ్యక్షులు ముప్పు రామారావు, జవహర్‌నగర్ డివిజన్ అధ్యక్షురాలు, మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, కీసర డివిజన్ అధ్యక్షులు స్వప్న విజయ్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ చైర్మన్ ప్రణీత, జవహర్‌నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మాజీ మేయర్ కావ్య, నాగారం మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, జవహర్‌నగర్ బీఆర్ఎస్ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, దమ్మాయిగూడ టీడీపీ అధ్యక్షులు కృష్ణారావు, డీసీసీ కార్యదర్శి పంగ హరిబాబు, శ్రీకాంత్ రెడ్డి, సదానంద, సీనియర్ నాయకులు శంకర్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు యాదగిరి గౌడ్, వెంకట్ రెడ్డి, రమేష్, హరి గౌడ్, శ్రీహరి గౌడ్, జేఏసీ నాయకులు, అఖిలపక్ష ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





అధిక ధరలకు బియ్యంను విక్రయిస్తే కఠిన చర్యలు

అదనపు కలెక్టర్ (సివిల్ సప్లయస్) డి.విజయంధర్ రెడ్డి





సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఇంత వరకు జిల్లాలో 10 క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని. జిల్లా సరఫరల అధికారి, సివిల్ సప్లై అధికారులు ప్రతి రోజు తనిఖీలు చేస్తారని తెలిపారు. ప్రజలకు న్యాయమైన ధరలకు బియ్యం అందేలా సంబంధిత వ్యాపారులు నిర్ణయాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. అదే విధంగా ప్రతి రిటైల్ హోల్ సేల్ వ్యాపారి వారి షాప్ ముందు బ్యానర్ డిస్ప్లే చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సూచించారు

మేడ్చల్, నవంబర్ 3: (మనం జిల్లా ప్రతినిధి): నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని, అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అద్దులకు కలెక్టర్ (సివిల్ సప్లై) డి.విజయంధర్ రెడ్డి హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల బియ్యం విక్రయ ధరలు ఈక్రింది విధంగా ప్రభుత్వం నిర్ణయించిందని, తెలంగాణ బీపీటీ బియ్యం: కిలో రూ. 66 తెలంగాణ సోనా బియ్యం: కిలో రూ. 74- తెలంగాణ శ్రీరామగోల్ బియ్యం: కిలో రూ. 79 రైస్ మిల్లర్లు, రైస్ ట్రేడర్లు, హోల్సేల్ డిపో నిర్వాహకులు, రిటైలర్లు నిర్ణయించిన గరిష్ట ధరలకు మించకుండా బియ్యం విక్రయించాలని సూచించారు. వినియోగదారుల నుంచి నిర్ణయించిన ధరల కంటే అధిక మొత్తాన్ని వసూలు చేయరాదని స్పష్టం చేశారు. నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా అధిక ధరలకు బియ్యం విక్రయించినట్లు గుర్తించిన పక్షంలో,

ఎఫ్ఐఏ ఆసియా-పసిఫిక్ ర్యాలీ చాంపియన్గా హైదరాబాద్ కుర్రోడు



హైదరాబాద్, నవంబర్ 03 (మనం న్యూస్) : హైదరాబాద్కు చెందిన రేసర్ జీత్ జబాఖ్-2026 ఎఫ్ఐఏ ఆసియా-పసిఫిక్ ర్యాలీ చాంపియన్షిప్ ఓవరాల్ టైటిల్ను కైవసం చేసుకున్నాడు. సహచర కో-డ్రైవర్ మూసా షరీఫ్తో కలిసి ఈ ఘనత సాధించాడు. 38 ఏళ్ల టోర్నీ చరిత్రలో టూ-వీల్ డ్రైవ్ కారులో ఓవరాల్ టైటిల్ గెలిచిన తొలి డ్రైవర్గా జీత్ రికార్డు సృష్టించాడు. 73 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్న పోటీదారుడిపై 35 పాయింట్ల ఆధిక్యం సాధించాడు. న్యూజిలాండ్లోని ఒటాగో ర్యాలీ, చెన్నై సౌత్ ఇండియా ర్యాలీలో రెండో స్థానం, ఇండోనేషియా ర్యాలీలో విజయం సాధించాడు. దీంతో మూసా షరీఫ్-26 కో-డ్రైవర్స్ చాంపియన్షిప్ను కూడా దక్కించుకున్నాడు. గతంలో సర్క్యూట్ రేసింగ్లో రెండుసార్లు జాతీయ చాంపియన్గా నిలిచిన జీత్, 2024 నుంచి ర్యాలీ పోటీల్లో పాల్గొంటున్నాడు.

ఇందిరా నగర్ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం

రూ. 49 లక్షలతో ఊపందుకున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

ఏళ్ల తరబడి నరకయాతనకు తెరపడటంతో స్థానికుల హర్షం

మేడ్చల్, నవంబర్ 3 : (మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ పట్టణంలోని తుమ్మ చెరువు హౌసింగ్ బోర్డు నుండి లైబ్రరీ వరకు వెళ్లే ప్రధాన రహదారికి ఎట్టకేలకు మహర్దశ పట్టింది. గత కొన్నేళ్లుగా గుంతలమయంగా మారి, ప్రయాణికులకు చుక్కలు చూపించిన ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో వేగం పుంజుకున్నాయి. దాదాపు రూ. 49 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ సీసీ రోడ్డు పనులు తుది దశకు చేరుకుంటుండటంతో ఇందిరా నగర్ కాలనీ వాసులు ఊపిరి పీల్చుకుంటున్నారు. రాయలాపూర్, గిర్మపూర్ గ్రామాలతో పాటు స్థానిక రైల్వే స్టేషన్, వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడానికి ఇదే ప్రధాన మార్గం. అయితే ఏళ్ల తరబడి సరైన మరమ్మతులు లేకపోవడంతో ఈ రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. చినుకు పడితే చాలు రోడ్డంతా బురదమయంగా మారి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ దుస్థితిపై స్థానికులతో పాటు వివిధ రాజకీయ పార్టీలు సైతం అనేకసార్లు ఆందోళనలు చేపట్టాయి. గతంలో బీఆర్ఎస్ నాయకులు బురద రోడ్డులోజూజూ వరి నాట్లు వేసి వినూత్న నిరసన తెలపగా, బీజేపీ నాయకులు రెండుసార్లు ధర్నాలు నిర్వహించి జిల్లా జూకలెక్టర్కు సైతం ఫిర్యాదులు అందజేశారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు రూ. 49 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గతంలో కొంత మేర పనులు జరగగా, మంగళవారం నాడు పూర్తిస్థాయిలో సీసీ లోడు వేసి నిర్మాణాన్ని వేగవంతం చేశారు. ఏళ్ల నాటి సమస్య పరిష్కారమవుతుండటంతో ఇందిరా నగర్ వాసులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తయితే చుట్టుపక్కల గ్రామాలకు, రైల్వే స్టేషన్కు రాకపోకలు సాఫీగా సాగుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రోడ్డు పనులను ఏఈ మమత సూపర్వైజర్ లావణ్య క్యూసి అధికారులు సిబ్బంది పరిశీలించారు.



తార్నాక బీజేపీలో ఫ్లెక్సీల చించివేత

మళ్లీ తెరపైకి వర్గ విభేదాలు..

అమిత్ షా మహా పాదయాత్ర స్వాగత ఏర్పాట్లలో చిరిగిన ఫ్లెక్సీలు..

రాజకీయ వర్గాల్లో చర్చ..

అసంతృప్తికి సంకేతమా? వివాదాలకు దూరంగా ఉండాలంటున్న శ్రీరామ్ వెంకట్..

సికింద్రాబాద్, నవంబర్ 3 (మనం న్యూస్) నగరంలో సోమవారం నాడు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాదయాత్ర సందర్భంగా సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఇంటలెక్చువల్ సెల్ ఇంచార్జ్ శ్రీరామ్ వెంకటేష్ తార్నాకలో ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలు చిరిగిపోవడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు దెబ్బతినడం వెనుక ఉద్దేశపూర్వక చర్యలు ఉన్నాయా? లేక ఇతర కారణాలా? అన్న చర్చ కార్యకర్తల్లో మొదలైనట్లు తెలుస్తోంది. స్థానికంగా పార్టీ నాయకుల మధ్య నెలకొన్న విభేదాల నేపథ్యంలో ఈ ఘటనకు రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది. అయితే ఈ పరిణామాలపై ఎవరిపైనా నేరుగా ఆరోపణలు చేయకుండా పార్టీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపైనే కార్యకర్తలు దృష్టి సారించారు. మరోవైపు, ఫ్లెక్సీలు చిరిగిపోయినా కార్యకర్తల ఉత్సాహం తగ్గలేదని మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ ఇంటలెక్చువల్ సెల్ కన్వీనర్ శ్రీరామ్ వెంకట్ పేర్కొన్నారు. ఫ్లెక్సీల కంటే పార్టీ సిద్ధాంతాలు, ప్రజాస్వామ్య విలువలు, కార్యకర్తల ఐక్యత ముఖ్యమని స్పష్టం చేశారు. వ్యక్తిగత విభేదాలు, అనవసర వివాదాలకు తావివ్వకుండా ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అయితే ఫ్లెక్సీల ఘటన స్థానిక బీజేపీలో అంతర్గత సమన్వయంపై మరోసారి చర్చకు తెరలేపింది.



పగిలిన డ్రైనేజీ పైప్లైన్తో రోడ్డుపైకి మురుగునీరు

నూతన పైప్లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం..





సికింద్రాబాద్, నవంబర్ 3 (మనం న్యూస్) రాంగోపాల్ పేట డివిజన్ పరిధిలోని మెక్లడ్గూడలో మురుగునీటి సమస్య స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో, దీనికి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడతామని మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించడమే కాకుండా తాగునీరు కలుషితమవుతోందన్న ఫిర్యాదులపై ఆయన మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మురుగునీరు రహదారులపై నిలిచి ప్రవహిస్తుండటంతో నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తాగునీరు సైతం కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య తీవ్రతను పరిశీలించిన తలసాని, మురుగునీరు పొంగిపొర్లడానికి గల కారణాలపై వాటర్ వరక్స్ అధికారులను ఆరా తీశారు. ఈ ప్రాంతం గుండా వెళ్లే డ్రైనేజీ పైప్ లైన్ దెబ్బతినడంతో నాలాలోని మురుగునీరు పైప్ లైన్ లోకి చేరి ఓవర్ఫ్లో అవుతోందని వాటర్ వరక్స్ జీఎం వెంకట్ రెడ్డి వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, పాత సమస్యకు తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా భవిష్యత్తులో పునరావృతం కాకుండా నూతన పైప్లైన్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తక్షణమే మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు చేపట్టాలని, పనులను వేగవంతం చేసి ప్రజలకు ఉపశమనం కలిగించాలని సూచించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకుంటానని, వీలైనంత త్వరగా మెక్లడ్గూడ వాసులకు ఇబ్బందులు తొలగిస్తానని తలసాని భరోసా ఇచ్చారు.

డైరెక్టర్ పదవికి దూరం..

ఎమ్మెల్సీ రాజకీయానికి చేరువ!

ఎమ్మెల్యే కాలే యాదయ్యకు లేఖ..

పిఎసిఎస్ డైరెక్టర్లు జాబితా నుంచి పేరు తొలగించాలని విజ్ఞప్తి

సర్పంచ్ నుంచి రాష్ట్రస్థాయి నాయకత్వం వరకు ఎదిగిన చింపుల సత్యనారాయణ రెడ్డి..కాలే యాదయ్యకు లేక రాసి డైరెక్టర్ పదవిని తిరస్కరణ

చేవెళ్ల, నవంబర్ 03(మనం న్యూస్): చేవెళ్ల పీఏసీఎస్ డైరెక్టర్ పదవికి తన పేరును ప్రతిపాదించినప్పటికీ, వ్యక్తిగతంగా తనకున్న రాజకీయ, సంస్థాగత బాధ్యతలు మరియు భవిష్యత్ రాజకీయ లక్ష్యాల దృష్ట్యా ఆ పదవిని స్వీకరించేందుకు సిద్ధంగా లేనని తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. తనపై నమ్మకంతో అడగకుండానే ప్రతిష్ఠాత్మకమైన పీఏసీఎస్ డైరెక్టర్ పదవికి ఎంపిక చేయాలని భావించినందుకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యకు కృతజ్ఞతలు తెలుపుతూనే, పీఏసీఎస్ డైరెక్టర్ల జాబితా నుంచి తన పేరును తొలగించాలని కోరుతూ ఆయన లేఖ రాశారు.

ఈ సందర్భంగా....తన రెండు దశాబ్దాల రాజకీయ ప్రస్థానాన్ని, స్థానిక సంస్థలపై తనకున్న అనుభవాన్ని, కాంగ్రెస్ పార్టీలో తన పాత్రను,భవిష్యత్ రాజకీయ ప్రణాళికలను ఆయన వివరించారు.

సర్పంచ్ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి నాయకత్వం వరకు ప్రస్థానం!....

2006లో దేవుని ఎర్రవల్లి గ్రామ సర్పంచ్గా ఎన్నికైన



సత్యనారాయణ రెడ్డి, గ్రామస్థాయి రాజకీయాల నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. సర్పంచ్గా పనిచేస్తూనే రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా, అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర విభజన అనంతరం చేవెళ్ల మండల జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశారు.2019లో చేవెళ్ల మండల పరిషత్ అధ్యక్ష పదవికి పోటీ చేశారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి స్థానిక సంస్థల హక్కులు, ప్రజాప్రతినిధుల సమస్యలపై తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడిగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటం కొనసాగిస్తున్నారు.

రేవంత్ రెడ్డి నాయకత్వంపై నమ్మకంతోనే కాంగ్రెస్లోకి!....

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధిగా, ఎమ్మెల్సీగా ఉన్నప్పటి నుంచే ఆయనతో కలిసి స్థానిక సంస్థల బలోపేతం కోసం పనిచేశానని సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఆ పరిచయం, రాజకీయ విశ్వాసంతోనే 2017లో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన సమయంలో ఆయన నాయకత్వంపై నమ్మకంతో తాను కూడా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వెల్లడించారు.

రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను రాష్ట్రంలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇన్చార్జిగా నిర్వహించానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ, రాష్ట్ర అధ్యక్షుల ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన పీసీసీ డెలిగేట్గా చేవెళ్ల నియోజకవర్గం నుంచి తానే ఏకైక ప్రతినిధిగా ఉన్నానని పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయ కమిటీ చైర్మన్గా బాధ్యతలు నిర్వర్తించానని గుర్తుచేశారు.

పదవుల కోసం రాజకీయాల్లోకి రాలేదు..ప్రజా హక్కుల కోసం పోరాడుతున్నా!.....

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడిగా కొనసాగుతున్నానని తెలిపారు. ఇటీవల అధిష్ఠానం తనకు డీసీసీబీ చైర్మన్గా అవకాశం కల్పించాలని భావించినప్పటికీ, అందరికీ తెలిసిన కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ అవకాశం చేజారిందని పేర్కొన్నారు.

అయితే పదవులు రాకపోయినా ప్రజా సమస్యలపై, స్థానిక సంస్థల హక్కులపై తన పోరాటం ఆగలేదని ఆయన స్పష్టం చేశారు. తన రాజకీయ అనుభవాన్ని కేవలం నామమాత్రపు పదవులకే పరిమితం చేసుకోవాలనుకోవడం లేదని, ప్రజాక్షేత్రంలో మరింత కీలక బాధ్యతలు చేపట్టాలన్నదే తన అభిమతమని ఆయన అభిప్రాయపడ్డారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా బరిలోకి దిగడమే లక్ష్యం!....

రాబోయే నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో చేవెళ్ల శాసన సభ్యుడిగా పోటీ చేసే అవకాశం లేని పక్షంలో, రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయాలన్నది తన రాజకీయ లక్ష్యమని సత్యనారాయణ రెడ్డి వెల్లడించారు.ఈ విషయాన్ని గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినప్పుడు వారి నుంచి సానుకూల స్పందన లభించిందని తెలిపారు.

ఈ నేపథ్యంలో రాబోయే రెండేళ్లు తన రాజకీయ లక్ష్య సాధన కోసం పూర్తిస్థాయిలో సమయం కేటాయించాల్సి ఉంటుందని,అలాంటి సమయంలో పీఏసీఎస్ డైరెక్టర్ పదవిని స్వీకరించి దానికి తగిన న్యాయం చేయలేనని స్పష్టం చేశారు.

పదవి ముఖ్యం కాదు..బాధ్యతకు న్యాయం చేయడమే ముఖ్యం!...

తనపై నమ్మకంతో,తాను అడగకుండానే పీఏసీఎస్ డైరెక్టర్ పదవికి పరిశీలించిన ఎమ్మెల్యే కాలే యాదయ్యకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తూనే,తన ప్రస్తుత బాధ్యతలు,రాజకీయ లక్ష్యాల దృష్ట్యా ఆ పదవిని స్వీకరించడం సముచితం కాదని సత్యనారాయణ రెడ్డి తేల్చిచెప్పారు.తన పేరును పీఏసీఎస్ డైరెక్టర్ల జాబితా నుంచి తొలగించాలని సవినయంగా కోరారు. పదవుల కోసం నాయకుల చుట్టూ తిరిగే రాజకీయాలు తనవి కావని, ప్రజా ఉద్యమాల నుంచి ఎదిగిన తనకు భవిష్యత్తులో మరింత పెద్ద రాజకీయ బాధ్యతలు చేపట్టాలనే లక్ష్యం ఉందని ఆయన లేఖ ద్వారా స్పష్టం చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

జిల్లాలో బియ్యం ధరల నియంత్రణకు విస్తృతంగా తనిఖీలు

బియ్యాన్ని అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై కఠిన తీసుకుంటున్న పౌరసరఫరాల అధికారులు

ఇప్పటికే పలువురు వ్యాపారులపై క్రిమినల్ కేసులు

అయినా ఆగని బియ్యం ధరల నియంత్రణ

మేడ్చల్, నవంబర్ 3 : (మనం జిల్లా ప్రతినిధి): బియ్యం అధిక ధరలకు అమ్మే వ్యాపారులపై దుకాణాలపై జిల్లా పౌర సరస్వరాల అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కొందరు ట్రేడర్లపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే బియ్యం విక్రయించాలని జిల్లా పౌర సరఫరాల అధికారులు పదే పదే చెబుతున్నప్పటికీ, తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ పట్టణ శివారు ప్రాంతాలలో లోని వ్యాపారులు అధిక ధరలకు బియ్యాన్ని విక్రయిస్తూ ప్రజలను దోచుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

క్రిమినల్ కేసులకు సైతం భయపడని వ్యాపారులు

ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే బియ్యాన్ని విక్రయించాలని,అధిక ధరల కు బియ్యం ను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అవసరమైతే క్రిమినల్



కేసులు పెడతామంటూ హెచ్చరించిన వ్యాపారస్తులు జంకడం లేదని ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఇప్పటికే నలుగురు ట్రేడర్లపై క్రిమినల్ కేసులు నమోదైనప్పటికీ భయం లేకుండా దుకాణం దారులు యధావిధిగా అధిక ధరలకు బియ్యాన్ని విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలు ఈ విధంగా ఉన్నాయి

తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల బియ్యం విక్రయ ధరలు ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ బీపీటీ బియ్యం కిలో రూ. 66, తెలంగాణ సోనా బియ్యం: కిలో రూ. 74, తెలంగాణ శ్రీరామగోల్ బియ్యం: కిలో రూ. 79 రైస్, మిల్లర్లు, రైస్ ట్రేడర్లు, హోల్సేల్ డిపో నిర్వాహకులు, రిటైలర్లు నిర్ణయించిన గరిష్ట ధరలకు మించకుండా బియ్యం విక్రయించాలని సూచించింది . వినియోగదారుల నుంచి నిర్ణయించిన ధరల కంటే అధిక మొత్తాన్ని వసూలు చేయరాదని స్పష్టం చేసింది. నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా అధిక ధరలకు బియ్యం విక్రయించినట్లు గుర్తించిన పక్షంలో, సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం హెచ్చరించింది.

ఇంత వరకు జిల్లాలో 10 క్రిమినల్ కేసులు నమోదు చేసింది. సివిల్ సప్లై అధికారులు ప్రతి రోజు తనిఖీలు చేస్తున్న దుకాణదారులం వైఖరిలో మార్పు రావడం లేదు . ప్రజలకు న్యాయమైన ధరలకు బియ్యం అందేలా సంబంధిత వ్యాపారులు నిర్ణయాలను తప్పనిసరిగా



పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత పౌరసరఫరాల అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన దుకాణదారులు పాటించడం లేదని విమర్శలు ఉన్నాయి.

దుకాణాల ముందు డిస్ప్లే లు ఎక్కడ?

అదే విధంగా ప్రతి రిటైల్ హోల్ సేల్ దుకాణాల ముందు ధరలతో కూడిన డిస్ప్లే లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం, అధికారులు సూచించారు. లేనిపక్షంలో క్రిమినల్ కేసులు పెడతామని కూడా హెచ్చరించారు. జిల్లాలో ఏ ఒక్కరో ఇద్దరో తప్ప తమ దుకాణాల ముందు ఏ ఒక్కరు ధరలతో కూడిన డిస్ప్లే లను ఉంచడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలకు ధరల వివరాలు తెలిసేలా ప్రతి దుకాణం ముందు ధరలతో కూడిన డిస్ప్లే లను ఏర్పాటు చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

బీజేపీకి రాజీనామా చేసిన పోతగంటి మహేష్

(తలకొండపల్లి నవంబర్ 03/మనో న్యూస్): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల బీజేపీలో ప్రకంపనలు సృష్టించే పరిణామం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు,సీనియర్ నేత పోతుగంటి మహేష్ భారతీయ జనతా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి,తన పదవులకు రాజీనామా చేశారు.ఈ మేరకు ఆయన నవంబర్ 03న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులకు లేఖ రాశారు.



బీజేపీలో దళితులకు గుర్తింపు లేదు

పోతుగంటి మహేష్ ఆవేదన

తన రాజీనామాకు గల కారణాలను వివరిస్తూ పోతుగంటి మహేష్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం వ్యక్తిగత కారణాలే కాకుండా, బీజేపీ పార్టీలో దళిత సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆయన ఆరోపించారు. 'గత 20 ఏళ్లుగా పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేశాను,కానీ పార్టీలో దళిత నాయకులకు సరైన గుర్తింపు లేదు, గౌరవం లేదని ఆయన ధ్వజమెత్తారు.ఎన్నికల సమయంలో మాత్రమే దళితులను వాడుకుని, తర్వాత పట్టించుకోవడం లేదని అవేదన వ్యక్తం చేశారు.నాలాంటి కింది స్థాయి దళిత కార్యకర్తల గోడు పై నాయకత్వానికి వినిపించడం లేదు' అని ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.'నాకు అవకాశం కల్పించిన నాయకత్వానికి, నాతో కలిసి పనిచేసిన కార్యకర్తలకు, నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.నా రాజీనామాను ఆమోదించి పార్టీ సభ్యత్వం నుండి తొలగించాలని కోరుతున్నాను' అని లేఖలో పేర్కొన్నారు.

తలకొండపల్లి రాజకీయాల్లో కీలక పరిణామం

తలకొండపల్లి మండలం కల్వకుర్తి నియోజకవర్గంలో బీజేపీకి కంచుకోట లాంటిది. ఇక్కడ పార్టీకి బలమైన క్యాడర్ ఉంది. అలాంటి మండలంలో 20 ఏళ్ల అనుభవం ఉన్న సీనియర్ దళిత నేత పార్టీని వీడటం బీజేపీకి కోలుకోలేని దెబ్బగా భావిస్తున్నారు. మండలంలో దళిత సామాజిక వర్గంలో పోతుగంటి మహేష్ కు మంచి పట్టు ఉంది. ఆయన వెళ్లిపోవడంతో ఆ వర్గం ఓట్లు కూడా పార్టీకి దూరం అయ్యే ప్రమాదం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చజరుగుతోంది.

కాంగ్రెస్ వైపు చూపు?

పోతుగంటి మహేష్ తదుపరి ఏ పార్టీలో చేరబోతున్నారు అనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉందని, ఇప్పటికే ఆ పార్టీకి చెందిన కల్వకుర్తి నియోజకవర్గ కీలక నేతలతో చర్చలు జరిపారని ఆయన అనుచర వర్గం చెబుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆయన ఆకర్షితులయ్యారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు బీఆర్ఎస్ లోకి వెళ్తారన్న ప్రచారం కూడా లేకపోలేదు. అయితే దీనిపై ఆయన ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. మరికొన్ని రోజుల్లో తన అనుచరులతో సమావేశమై తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, దళిత నేత రాజీనామా బీజేపీకి ఇబ్బందికరంగా మారనుందని, ఈ పరిణామం మండలంలోని ఇతర దళిత నేతలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

ఓయూ లా కాలేజీ ఉనికికే ప్రమాదం..

హాస్టల్ తరలింపుపై వివాదం

స్కాలర్ షిప్ నిబంధనలతో పేద విద్యార్థులకు అన్యాయం.. బీఈడీ, లా విద్యార్థులకు వయోపరిమితి లేకుండా ఉపకార వేతనాలు ఇవ్వాలి..

అధికారుల నిర్లక్ష్యంతోనే హాస్టల్ సమస్య: నిరుద్యోగ విద్యార్థి జేఏసీ చైర్మన్ వి. భీంరావు నాయక్..



ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 3 (మనం న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీ భవిష్యత్తు, విద్యార్థుల వసతి సౌకర్యాలపై యూనివర్సిటీ అధికారుల తీరును రాష్ట్ర నిరుద్యోగ విద్యార్థి జేఏసీ చైర్మన్ వి. భీంరావు నాయక్ తీవ్రంగా తప్పుబట్టారు. లా కాలేజీకి చెందిన ఈ-1 హాస్టల్ ను తొలగించి, విద్యార్థులను ఓల్ సీ హాస్టల్ కు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దశాబ్దాలుగా లా విద్యార్థులకు ఉపయోగపడుతున్న హాస్టల్ ను తొలగించకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టి కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఒక కాలేజీకి ఒక ప్రత్యేక హాస్టల్ ఉండాలన్న నిబంధన, విద్యార్థుల సౌకర్యాలను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ-1 హాస్టల్ లో చిన్న చిన్న మరమ్మతులు, వాష్రూమ్ ల అభివృద్ధి, రంగులు వేయడం, నీటి పైపులైన్ ల ఏర్పాటు వంటి పనులు చేపడితే మరో 50 ఏళ్లపాటు విద్యార్థులకు ఉపయోగపడుతుందని భీంరావు నాయక్ పేర్కొన్నారు. హాస్టల్ ను తొలగించి బీఈడీ, లా, నిజాం కళాశాల విద్యార్థులకు కలిపి వసతి కల్పిస్తే అకడమిక్ షెడ్యూళ్లు, మెస్ నిర్వహణలో ఇబ్బందులు తలెత్తే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. లా విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ లేకుండా చేసే నిర్ణయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని స్పష్టం చేశారు. గతంలో హాస్టల్ నిర్మాణం కోసం అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి నిధులు కేటాయించినప్పటికీ నిర్మాణం ఎందుకు జరగలేదో అధికారులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మరోవైపు, పీజీ పూర్తిచేసిన తర్వాత లా చదివే విద్యార్థులకు, బీఈడీ తర్వాత ఇతర కోర్సులు అభ్యసించే విద్యార్థులకు స్కాలర్ షిప్ లు అందకపోవడం పేద విద్యార్థులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతోందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులు కాలేజీ ఫీజులతో పాటు మెస్ బిల్లులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ, లా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు వయోపరిమితితో సంబంధం లేకుండా స్కాలర్షిప్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 2014 నుంచి 2026 వరకు ఓయూ లా కాలేజీ పరిస్థితి క్రమంగా దిగజారుతోందని, ముఖ్యంగా 2019 - 2026 మధ్య కాలేజీకి వచ్చిన నిధులు, హాస్టల్ నిర్వహణ, మరమ్మతుల కోసం కేటాయించిన నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయా, హాస్టల్ నిర్వహణ ఎందుకు నిర్లక్ష్యానికి గురైందనే అంశాలను నిగ్గుతేల్చి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని హాస్టల్ తరలింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వి. భీంరావు నాయక్ విజ్ఞప్తి చేశారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

ఎనిమిది మున్సిపల్ వార్డుల్లో నమోదు ప్రక్రియ వేగవంతం: ఎమ్మెల్యే పద్మారావు..

సికింద్రాబాద్, నవంబర్ 3 (మనం న్యూస్) పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులైన వారు ఎవరూ మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ పార్టీ శ్రేణులకు సూచించారు. పట్టభద్రుల ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో చేర్చేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం వారాసిగూడలోని రెడ్క్రాస్ ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు శిబిరాన్ని ఆయన సందర్శించి నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో పట్టభద్రుల ఓటరు నమోదు ఆశించిన స్థాయిలో జరగడం లేదని, ఆన్లైన్ విధానంలోనూ తరచూ సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో అర్హులైన పట్టభద్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మున్సిపల్ వార్డుల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేసినట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అర్హులైన పట్టభద్రులను గుర్తించి వారి పేర్లను తప్పనిసరిగా నమోదు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు కిశోర్ కుమార్, మాజీ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్న లక్ష్మి తదితర నాయకులు పాల్గొన్నారు.



వైల్ వింగ్స్ సేవా భావం ఎంతో..గొప్పది

బయో ఎథికాన్ అవార్డు గ్రహీత మాచన రఘునందన్

హైద్రాబాద్ నవంబర్ 04 (మనం న్యూస్)ఒక వ్యక్తి గురించి ప్రతి ఒక్కరూ..గొప్పగా చెప్పుకునేలా ఆయా..వ్యక్తులు ఉన్నత శిఖరాలను అధిరోహించి వా..రే..వా.?! వాట్ ఏ గ్రేట్ అచీవ్మెంట్ అని అబ్బుర పడేలా యువత అంతటి ఎదుగుదలను సొంతం చేసుకోవాలని,అలాగే.. సేవా భావం కలిగి ఉండాలని,అపుడే ఆదరణ అధికం అవుతుందని కామన్ వెల్త్ బయో ఎథికాన్ అవార్డు గ్రహీత మాచన రఘునందన్ అన్నారు. ఆయన గచ్చిబౌలి లో వైల్ వింగ్స్ వ్యాపార సంస్థ నూతన శాఖ ను ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ.. వ్యాపార సంస్థలు కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ గా విద్య ను ప్రోత్సహించేందుకు ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.వైల్ వింగ్స్ అధినేత దూడం బాలకృష్ణ మాట్లాడుతూ..2027 నుంచి పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పేద బి సి విద్యార్థినులకు ప్రోత్సాహకంగా..నగదు తో పాటు చీర ను అందజేయనున్నట్టు తెలిపారు.

ఇన్ఫినిక్స్ నుంచి జీటీ-50 ప్రో విడుదల

హైదరాబాద్, నవంబర్ 03 (మనం న్యూస్) : ఇన్ఫినిక్స్ ఇండియా తన నూతన గేమింగ్ స్మార్ట్ఫోన్ జీటీ-50 ప్రోను భారత మార్కెట్లో విడుదల చేసినట్లు ఇన్ఫినిక్స్ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మిరాజ్ గుప్తా మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ఫోన్లో సెగ్మెంట్లోనే తొలిసారిగా హైడ్రోఫ్లో లిక్విడ్ కూలింగ్ సిస్టమ్, మీడియాటెక్ డిమెన్సిటీ 8400 అల్టిమేట్ ప్రాసెసర్, 144హెర్ట్స్ ఆమోలేడ్ డిస్ప్లే, 6500 ఎంఏహెచ్ బ్యాటరీ, డాల్బీ ఆటమ్స్ సాంకేతికతను అందించినట్లు చెప్పారు. గేమింగ్ నియంత్రణల కోసం ప్రెషర్-సెన్స్ జీటీ ట్రిగ్గర్స్ 2.0ను పొందుపరిచినట్లు తెలిపారు. జీటీ ఎన్ఎక్స్ కంట్రోలర్, జీటీ ఎన్ఎక్స్ స్టేషన్(డాక్), జీటీ మాగ్ ఛార్జ్ కూలర్ 2.0 వంటి ప్రత్యేక యాక్సెసరీలను కూడా పరిచయం చేసినట్లు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కౌన్సిలర్ వినతి

14వ వార్డులో సమస్యలపై అధికారులకు మెమొరాండం

వెంటనే సమస్యలు పరిష్కరించాలని మద్దెల శ్రీనివాస్ విజ్ఞప్తి



చేవెళ్ల,నవంబర్ 03 (మనం న్యూస్): వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చేవెళ్ల సబ్ స్టేషన్లో విద్యుత్ శాఖ అధికారులకు 14వ వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటిని తక్షణమే పరిష్కరించాలని మెమొరాండం ద్వారా కోరారు. ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి 14వ వార్డు కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా..... ఆయన మాట్లాడుతూ.... 14వ వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించి, ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ సాయినాథ్, ఏఈ రాజేందర్, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు...

చేవెళ్ల ట్రాఫిక్ సీఐ రాఘవేందర్‌కు ఘన సన్మానం

14వ వార్డ్ కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ మర్యాదపూర్వక భేటీ





చేవెళ్ల,నవంబర్ 03(మనం న్యూస్): చేవెళ్ల ట్రాఫిక్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాఘవేందర్ను 14వ వార్డు కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు అజీజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాల సహనానికి పరీక్ష.. డిసెంబర్ 15 నుంచి సమరశంఖం!





రూ.18 వేల ఫిక్స్డ్ వేతనం కోసం నిరవధిక సమ్మెకు సిద్ధం..

ప్రభుత్వానికి సమ్మె నోటీసులు

షాబాద్, నవంబర్ 3 (మనం న్యూస్) : ఏళ్ల తరబడి ప్రజారోగ్య సేవలందిస్తున్న ఆశా కార్యకర్తల సహనానికి ఇక పరీక్ష పెట్టవద్దని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఇందులో భాగంగా షాబాద్, చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా అల్లి దేవేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 28 వేల మంది ఆశా కార్యకర్తలు గత 20 ఏళ్లుగా చాలీచాలని పారితోషికాలతో విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలందించడంతో పాటు సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

ఆశాల ప్రధాన డిమాండ్లు ఇవే!

ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల స్థిర వేతనం నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎన్నో ఆందోళనలు, పోరాటాలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయిందని, హైదరాబాద్ కోఠిలోని కమిషనర్ కార్యాలయం ఎదుట సైతం పెద్ద ఎత్తున నిరసనలు తెలిపినా ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో షాబాద్, చందనవెల్లి ప్రాంతాలకు చెందిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దీపావళి వేళ.. బాణసంచా దుకాణాలపై పోలీసుల భద్రతా నిఘా





తాత్కాలిక బాణసంచా విక్రయదారులతో చిలకలగూడ పోలీసుల ప్రత్యేక సమావేశం..

అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి: ఎస్హెచ్ఓ వి. రామకృష్ణ..

సికింద్రాబాద్, నవంబర్ 3 (మనం న్యూస్) దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా విక్రయాల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చిలకలగూడ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా చిలకలగూడ పోలీస్ స్టేషన్లో తాత్కాలిక బాణసంచా దుకాణాల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్టేషన్ ఎస్హెచ్ఓ వి. రామకృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశంలో దుకాణాల నిర్వహణలో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. బాణసంచా దుకాణాల వద్ద అగ్నిమాపక పరికరాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని, అగ్నిప్రమాదాలు సంభవించకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని పోలీసులు సూచించారు. ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించకుండా విక్రయాలు కొనసాగించాలని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు సైతం తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదరహిత వాతావరణంలో దీపావళి పండుగను జరుపుకోవాలని చిలకలగూడ పోలీసులు కోరారు.

సొంత ఖర్చులతో బోరు వేయించిన సర్పంచ్

గ్రామస్తుల నీటి కష్టాలు తీర్చేందుకు అశోక్ చొరవ

కిష్టాపురం ప్రజల విజ్ఞప్తికి వెంటనే స్పందన

చేవెళ్ల,నవంబర్ 03 (మనం న్యూస్): గ్రామస్తుల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సర్పంచ్ పి.అశోక్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం చేవెళ్ల మండలం నాంచేరి గ్రామపంచాయతీ పరిధిలోని కిష్టాపురంలో నెలకొన్న నీటి సమస్యపై గ్రామస్తులు చేసిన విజ్ఞప్తికి ఆయన వెంటనే స్పందించారు.గ్రామ ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తన సొంత నిధులతో బోరు వేయించారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ సొంత ఖర్చులతో బోరు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు సర్పంచ్ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పూర్ణచంద్ర, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు...

